
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 28 । ఆగస్టు । 2023



సోమశిలలో నీటి నిల్వ
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 18.180 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 342 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,540
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,438
3శాతం జీఎస్టీతో	రూ.5,600
నవర (8గ్రా)	రూ.44,800

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
36.7 /26.7

ఆదివారం గాలిలో తేమ 43 శాతం ఉంది. సోమవారం జిల్లావ్యాప్తంగా ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

'జనహిత వాత్సల్య'కు రూ.5 లక్షల వితరణ
- అందజేసిన ఎంపీ వేమిరెడ్డి దంపతులు



ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులు ఆదివారం జనహిత వాత్సల్య సంస్థకు రూ.5 లక్షల విరాళంగా అందజేశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో సంస్థ కార్యదర్శి జీవీ సాంబశివరావుకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తమ సంస్థకు ఆర్థికసాయం అందిస్తున్నారని, నిరాధార బాలబాలికలు, వృద్ధులు, నిరుపేదలు, దళితులను ఈ సంస్థ అక్కున చేర్చుకుంటుందని తెలిపారు. దళిత విద్యార్థులకు వాత్సల్య విద్యా సంస్థ ద్వారా ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ఆర్థికసాయం చేయడంతోపాటు విద్యార్థుల బాగోగులు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులను సాంబశివరావు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో ఏపీ జ్యుడీషియల్ డైరెక్టర్



అమ్మవారిని దర్శించుకున్న హరిహరశర్మతో ఆలయ అధికారులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని కరెంటాఫీస్ సెంటర్ వద్ద ఉన్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరశర్మ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హరిహరశర్మకు దేవస్థానం ఈఓ ఎ.వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ ఆర్.జయరామ్, ధర్మకర్తల మండలి సభ్యులు స్వాగతం పలికారు. దేవస్థానం ప్రధానార్చకుడు సురావఝుల రఘురామశర్మ, అవ్వారి రామకృష్ణశర్మ ఆశీస్సులు అందించారు.

వైభవంగా రంగడి పవిత్రోత్సవాలు



పవిత్రాలను తీసుకు వస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు ఆదివారం సంప్రదాయబద్ధంగా దేవస్థానం ప్రాంగణంలోని నాలుగు సన్నిధులలో పవిత్రాల సమర్పణ చేశారు. దేవస్థానం ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు శాస్త్రోక్తంగా తిరుమంజనం, హోమాలు, గోపురోత్సవం తదితర పూజాదికాలను నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ డి.వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ.శివకుమార్‌ఆచారి, సభ్యులు టీవీ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుపై దాడి
- రేషన్ బియ్యం, రోజ్‌ఉడ్ దుంగలు స్వాధీనం

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని నారాయణరెడ్డిపేట సమీపంలోని ఓ రైస్‌మిల్లుపై ఆదివారం రాత్రి రూరల్ పోలీసులు దాడి చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి మిల్లుకు రేషన్ బియ్యం తరలించి ఇక్కడి నుంచి ఎర్రచందనం ఎగుమతులు చేస్తున్నట్లు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో దాడులు చేశారు. 30 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు సమాచారం. అలాగే పోలీసుల తనిఖీల్లో రోజ్‌ఉడ్ దుంగలు కూడా బహిర్గతమైనట్లు తెలిసింది. గత కొంతకాలంగా రైస్‌మిల్లు కేంద్రంగా అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారంతోనే పోలీసులు దాడులు చేసినట్లు తెలిసింది. కాగా రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా సరిగా స్పందించలేదు. రూరల్ పోలీసులు సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

వరుణ దేవా.. కరుణ లేదా!



జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో అనావృష్టి పరిస్థితుల కారణంగా మెట్ట పైర్ల సాగుకు ఆటంకం ఏర్పడింది. మెట్ట ప్రాంతంలో ప్రధానంగా వర్షాధారంపై ఆధారపడి తృణధాన్యాలు, పప్పుధాన్యాలను రైతులు సాగు చేస్తుంటారు. ఈ సీజన్‌లో జూన్ నెలలో కొద్దిపాటి జల్లులు మినహా ఇప్పటి వరకు సరైన వర్షాలు లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.



ఉదయగిరి ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో దుక్కి చేయకుండా ఉన్న పొలాలు

మెట్ట పైర్ల సాగుకు ముఖం చాటేసిన వరుణుడు
- ఖరీఫ్ సీజన్ చివరికి వస్తున్నా మార్పులేని పరిస్థితి
- వర్షాభావంతో అడుగంటుతున్న భూగర్భ జలాలు

సాక్షి, నెల్లూరు డెస్క్: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు ముఖం చాటేయడంతో మెట్ట పైర్ల సాగుకు అనుకూలత లేదు. ముఖ్యంగా ఉదయగిరి, కావలి, ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్లలో జూన్ నుంచి ఆగస్టు వరకు కురిసే వర్షాల ఆధారంగా కంది, మినుము, కుసుమ, ఆముదం, పొద్దుతిరుగుడు, రాగి, సజ్జ, జొన్న తదితర పైర్లు సాగు చేస్తారు. జూన్, జూలై నెలల్లో పడే వర్షంతో రైతులు కంది సాగు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో కంది సాగు లేనట్లే. ఖరీఫ్ సీజన్‌లో కురిసే వర్షాల ఆధారంగా జిల్లాలో మినుము సాగు చేస్తారు. కానీ ఇంతవరకు దుక్కి చేసేందుకు సరిపడా వర్షాలు లేకపోవడంతో సెప్టెంబర్ మొదటి వారంలో విత్తువేసే మినుము సాగు కూడా ఈ సీజన్‌లో ప్రశ్నార్థకంగానే మారింది. వీటితోపాటు కొన్ని మండలాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేసే రాగి, సజ్జ, జొన్న, పొద్దుతిరుగుడు లాంటి పంటలు కూడా వేసే పరిస్థితి లేదు. గత మూడేళ్ల నుంచి ఖరీఫ్ సీజన్‌లో మెట్ట పైర్లకు ఢోకా లేకపోయినప్పటికీ, ఈ ఏడాది వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వర్షాలు లేకపోవడంతో మెట్ట పైర్ల సాగు ఆలస్యమవుతోంది.

పంటల సాగుపై వర్షపాతం ప్రభావం
ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలోని 38 మండలాల్లో కేవలం ఆరు మండలాల్లోనే సాధారణ వర్షపాతం నమోదు కాగా, 22 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. మిగతా 10 మండలాల్లో అత్యల్ప వర్షపాతం ఉంది. 2020, 2021, 2022 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురవడంతో మెట్ట పైర్లు బాగా పండాయి. ఖరీఫ్‌లో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం 331.4 మి.మీ. కాగా, గత మూడేళ్లలో వరుసగా 360.2 మి.మీ., 489 మి.మీ., 353 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా మినుము 9,209 హెక్టార్లు, పెసర 3,452 హెక్టార్లు, కంది 15 వేల ఎకరాలు, రాగి 680 ఎకరాలు, సజ్జ 340 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా, ఇంతవరకు ఒక్క ఎకరాలో కూడా సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

తగ్గుతున్న పప్పు ధాన్యాల సాగు
పప్పు ధాన్యాల సాగు కూడా గణనీయంగా తగ్గింది. మెట్టరైతులు ప్రధానంగా మినుము, పెసర, పచ్చిశనగ పంటలను ఆగస్టులోనే సాగు చేస్తుంటారు. దుక్కి దున్నకం పనుల నుంచి పంటలకు పురుగుమందుల పిచికారీ వరకు మెట్ట రైతులు వ్యవసాయ పనుల్లో తలమునకలై ఉండాల్సిన సమయంలో ప్రస్తుతం వర్షాలు లేక రైతన్నలు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. గతేడాది, అంతకుముందు ఏడాదితో పోల్చిచూస్తే ఈ ఏడాది పప్పుధాన్యాల సాగు బాగా తగ్గింది.

వర్షాభావ తీవ్రత మండలాలు
ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం, చేజర్ల, కలువాయి, అనుమసముద్రంపేట, వింజమూరు, ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి, జలదంకి, కావలి, బిట్రగుంట, ఉలవపాడు, కందుకూరు, వలేటివారిపాళెం, రాపూరు, పొదలకూరు, లింగసముద్రం.

కొన్నిచోట్ల ఆందోళనకరం
ముఖ్యంగా ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, కలిగిరి, సీతారామపురం, జలదంకి, సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల్లో 50 శాతానికిపైగా వర్షపాతం లోటు ఉంది. దీంతో ఆయా మండలాల్లో భూగర్భ జలాలు కూడా మరింత లోతుకు జారుతున్నాయి. ఫలితంగా కొన్ని మండలాల్లో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఏర్పడింది. ఇక పంటలపై కూడా వర్షాభావ ప్రభావం తీవ్రంగా పడుతోంది. మెట్ట ప్రాంతాల్లో పంటలు వర్షాలపైనే ఆధారపడి ఉంటాయి. కానీ సాధారణ స్థాయిలో కూడా వర్షాలు కురవకపోవడంతో అది పంటల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పొదలకూరు మండలంలో గతేడాది సాగు చేసిన మినుము పంట

ఆర్బీకేల ద్వారా అవగాహన
వ్యవసాయశాఖ గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తోంది. ప్రధానంగా పంటల మార్పిడి పద్ధతికి రైతులు అలవాటు పడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం ఖరీఫ్‌లో మినుము, పెసర పంటలే సాగు చేయాల్సిన పనిలేదని అంతర పంటగా కందిని సాగు చేస్తే రైతులు నష్టపోవాల్సిన అవసరం ఉండదని అవగాహన కల్పిస్తున్నారు. ఆర్బీకేల స్థాయిలో వ్యవసాయ సలహామండలి సభ్యులతో ముందుగా వ్యవసాయాధికారులు మాట్లాడి వారి ద్వారా రైతులకు వివరిస్తున్నారు.

మెట్ట పైర్ల సాగు ప్రశ్నార్థకంగా ఉంది



ఈ ఏడాది ఇంతవరకు వర్షాలు లేకపోవడంతో మెట్టలో మినుము, కంది సాగు చేసేందుకు దుక్కులు కూడా చేయలేని పరిస్థితి ఉంది. ఇప్పటికే కంది సాగు సమయం మించిపోయింది. మినుము సాగు చేయాలన్నా మరో వారం రోజుల్లో వర్షాలు పడితే దుక్కులు చేసుకునే వెసులుబాటు ఉంది. లేకపోతే మినుము కూడా సాగు చేయలేం. ఈ ఏడాది రైతులకు ఇబ్బందికర పరిస్థితులు కనిపిస్తున్నాయి.

– శ్రీనివాసరెడ్డి, రైతు, ఉదయగిరి

వరుణుడు కరుణిస్తేనే పైర్లు



మూడేళ్ల నుంచి ఖరీఫ్‌లో మంచి వానలు పడడంతో మెట్ట పైర్ల సాగుకు అనుకూలంగా ఉండి మంచిగా పంటలు పండించాం. కానీ ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరుణుడు ముఖం చాటేశాడు. ఈ నెల చివర, వచ్చే నెల మొదటి వారంలో వర్షాలు లేకపోతే మెట్ట పైర్ల సాగు కష్టమే. గత మూడేళ్ల నుంచి ఎండాకాలంలో కూడా నీటి వనరుల్లో పుష్కలంగా నీరు ఉండేది. కానీ ఈ ఏడాది జూన్ నెల నుంచి వానలు లేకపోవడంతో నీటి వనరులు వట్టిపోయాయి.

– సిద్దు రామిరెడ్డి, రైతు

పరుగుల 'తేజ'ం

ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన వల్లిపి హిమతేజ క్రీడా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆరేళ్లలోనే అంతర్జాతీయస్థాయిలో పతకాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేశారు. ఈ నెల 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సందర్భంగా పరుగుల తేజం 'హిమతేజ' ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

- అంతర్జాతీయస్థాయిలో తొలి మెడల్ అందుకున్న అథ్లెట్ హిమతేజ
- ఆరేళ్లుగా విజయపరంపర కొనసాగిస్తున్న క్రీడాకారుడు



సౌత్‌కొరియాలో బ్రాంజ్‌మెడల్ సాధించిన హిమతేజ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఉమ్మడి నెల్లూరు జిల్లా చిల్లకూరులో పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వల్లిపి వెంకటేశ్వర్లు–కోటేశ్వరమ్మలకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు హిమతేజకు చిన్నతనం నుంచి క్రీడల పట్ల ఆసక్తి ఎక్కువ. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. చిల్లకూరులో ఎల్ఏపీ స్కూల్‌లో 8వ తరగతి చదువుతుండగా ఆ స్కూల్ పీఈటీ బి.రమేష్ హిమతేజలోని క్రీడాప్రతిభను గుర్తించారు. అప్పటి నుంచి అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇచ్చారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందేల్లో శిక్షణ ఇచ్చారు. స్కూల్‌స్థాయి, ఇంటర్ స్కూల్స్, మండలస్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. 2014 నుంచి 2017 వరకు మండల, నియోజకవర్గ స్థాయిల్లో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటాడు. అనంతరం జిల్లాస్థాయి పోటీలు, స్కూల్‌గేమ్స్‌లో రాణించేందుకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా ప్రాధికారసంస్థ కోచ్ రజనీకాంత్ శిక్షణలో మరిన్ని మెలకువలు నేర్చుకునే అవకాశం లభించింది. ఈ శిక్షణతో జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో పాల్గొన్నాడు. ఏలూరు, శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు. అంతేకాక కోచ్ రజనీకాంత్.. హిమతేజలోని ప్రతిభను గుర్తించి హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు రెఫర్ చేశారు. అక్కడ అథ్లెటిక్స్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్ పర్యవేక్షణలో శిక్షణ కొనసాగుతోంది. ఎప్పటికప్పుడు మెలకువలను నేర్చుకుంటూ అథ్లెటిక్స్‌లో విజయపరంపర కొనసాగిస్తున్నాడు. భోపాల్‌లో జరిగిన జాతీయపోటీల్లో 400(100)లో గోల్డ్‌మెడల్, 2022 నవంబర్‌లో గువాహటిలో జరిగిన 37వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం, 2023 ఏప్రిల్‌లో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి 100 మీటర్ల పరుగుపందెంలో రజత పతకం సాధించాడు. దీంతో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 2023 జూన్‌లో సౌత్‌కొరియాలో జరిగిన అండర్–17 విభాగంలో 4(100) పరుగులో బ్రాంజ్‌మెడల్ సాధించి అంతర్జాతీయస్థాయి తొలి మెడల్‌ను అందుకున్నారు. క్రీడాప్రస్థానం ప్రారంభమైన ఆరేళ్లలోనే అత్యుత్తమ ఫలితాలు, అంతర్జాతీయస్థాయి పతకం సాధించడంతో నూతనోత్సాహంతో శిక్షణ, సాధన చేస్తున్నారు.

తండ్రి ఆకాంక్ష
కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు విద్యార్థి దశలో కబడ్డీ, పరుగుల్లో ప్రతిభ చూపేవారు. అయితే ఆర్థిక ఇబ్బందులతో క్రీడల్లో రాణించలేకపోయారు. ప్రస్తుతం తన కుమారుడు సాధిస్తున్న విజయాలతోపాటు తమ స్వగ్రామం దొరవారిసత్రం మండలం పూలతోట పేరు ప్రపంచవ్యాప్తంగా వినిపించడం తనకు సంతోషాన్ని కలిగిస్తుందని చెబుతున్నారు. అయితే శిక్షణ, సాధన, టోర్నమెంట్‌లకు అయ్యే ఖర్చు తన స్థాయికి మించిపోతోందని, ఆర్థికంగా ప్రోత్సాహం ఉంటే మరిన్ని విజయాలు సాధించే అవకాశం ఉంటుందని తండ్రి వెంకటేశ్వర్లు కోరుతున్నారు.



హిమతేజను అభినందిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటుతా
చదువుల్లోనూ, క్రీడల్లోనూ రాణించాలని చిన్నప్పటి నుంచి అమ్మ, నాన్న, గురువులు చెప్పిన విషయాలను పాటిస్తున్నాను. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్నా. అంతర్జాతీ స్థాయిలో తొలిపతకాన్ని సాధించడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో దేశం గర్వపడేలా అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటుతా.

– హిమతేజ

పోలీస్‌స్టేషన్ వద్ద టీడీపీ కార్యకర్త వీరంగం

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలకు చెందిన టీడీపీ కార్యకర్త పైడి హర్ష మద్యం మత్తులో బిట్రగుంట పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం వీరంగం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే కడనూతలకు చెందిన పైడి హర్ష మద్యం తాగి రైల్వే ఉద్యోగిని ఫోన్‌లో దుర్భాషలాడడంతో బాధితుడు కేసు పెట్టేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న హర్ష పోలీసుల ముందే అసభ్య పదజాలంతో రంకెలు వేస్తూ వీరంగం చేయడంతోపాటు సొంత సోదరుడిపై చేయి చేసుకున్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉన్నతాధికారుల సూచన మేరకు కేసు నమోదు చేసే అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.

పర్యాటక కేంద్రంగా ఎంజీఆర్ స్మారక కేంద్రం
- నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఉదయగిరి నియోజకవర్గ కేంద్రంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో నిర్మించనున్న స్మారక కేంద్రం, ధ్యాన మందిరాలు ప్రశాంతతకు, పర్యాటకానికి చిహ్నంగా ఉండేలా చర్యలు చేపట్టాలని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఉదయగిరిలో స్మారక కేంద్రం నిర్మాణంపై ఆదివారం నెల్లూరులోని మేకపాటి నివాసంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి ఆర్కిటెక్ట్ ఇంజినీర్ ఢిల్లీబాబుతో చర్చించారు. ఈ సందర్భంగా రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.5 కోట్ల వ్యయంతో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న మేకపాటి గౌతమ్‌రెడ్డి స్మారక కేంద్రంలోని నిర్మాణాలు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిని జ్ఞప్తికి తెచ్చేలా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ పర్యాటక కేంద్రమైన ఉదయగిరికి వచ్చే సందర్శకులు తప్పక ఎంజీఆర్ స్మారక కేంద్రాన్ని కూడా సందర్శించేలా నిర్మాణాలు చేయాలని తెలిపారు. వారి వెంట జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్ తదితరులు ఉన్నారు.



డిజైన్లు పరిశీలిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆస్తి ఒక్కటే.. రిజిస్ట్రేషన్ ఇద్దరికి

- కుటుంబ వివాదాల్లో ఉన్న ఆస్తి రిజిస్ట్రేషన్
- కేసులో ఇరుక్కున్న జిల్లా రిజిస్ట్రార్

కందుకూరు: ఇటీవల జిల్లా రిజిస్ట్రార్‌పై కేసు నమోదుకు కారణమైన ఆస్తి వివాదంలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చేసిన లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కుటుంబ వివాదాల్లో ఉన్న ఆస్తికి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు సార్లు రిజిస్ట్రేషన్ చేయడం.. రద్దు చేయడం రోజుల వ్యవధిలోనే జరిగింది. చివరికి అదే ఆస్తికి ప్రస్తుతం ఇద్దరు వ్యక్తులపై రిజిస్ట్రేషన్ చేసి ధ్రువపత్రాలు ఇచ్చారు. దీంతో ఇరుపక్షాల వారు ఆస్తి మాదంటే మాది అంటూ ఉన్నతాధికారులను ఆశ్రయించడం, పోలీసు కేసులు పెట్టుకోవడంతో జిల్లా రిజిస్ట్రార్‌పై కందుకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

వివాదంలో ఉన్న ఆస్తి ఇదే..
కందుకూరు పట్టణంలోని అమలనాథునివారిపాళెంలో సర్వే నంబర్ 865/1ఎ/1ఎ2ఎ1లో శెట్టి పేరయ్య అనే వ్యక్తి పేరుపై మూడున్నర సెంట్ల నివాస స్థలం ఉంది. పేరయ్యకు ఐదుగురు కుమార్తెలతోపాటు కోటేశ్వరరావు(ప్రభుత్వ ఉద్యోగి) అనే కుమారుడు ఉన్నాడు. కుమార్తెల్లో శాంతికుమారి అలియాస్ కుమారి దివ్యాంగురాలు కావడంతో మిగిలిన కుటుంబసభ్యులు ఆ ఆస్తిని ఆమె పేరుపై రాశారు. 2016లో ఆమె కూడా మరణించింది. ఆ తరువాతే ఈ స్థలం కోసం కుటుంబసభ్యుల మధ్య వివాదం ఏర్పడింది. ఇటు కోటేశ్వరరావు ఆ స్థలం నాదేనని వాదిస్తుండగా, ఆయన తల్లి నారాయణమ్మ ఆ స్థలం తన పేరుపై ఉందని చెబుతోంది. ఈ క్రమంలో తల్లీ, కొడుకు మధ్య వివాదం ఉండడంతో నారాయణమ్మ కావలిలో ఉంటున్న కుమార్తె వద్ద ఉంటూ మనవడు అయిన భానుకుమార్‌కు అదే ఆస్తిని రాసిచ్చింది. ఈ క్రమంలో రూ.కోటి విలువ చేసే ఆ ఆస్తి వివాదంగా మారింది.




కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ చేయడం.. రద్దు చేయడం
శాంతికుమారి చనిపోయే నాటికి ఆ ఆస్తి ఆమె పేరుపైనే రిజిస్ట్రేషనై ఉంది. కానీ కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా అదే ఆస్తిని పలుమార్లు రిజిస్ట్రేషన్ చేశారు. అదెలా అంటే శాంతికుమారి సోదరుడు కోటేశ్వరరావు ఆ ఆస్తి తన ఆధీనంలో ఉన్నట్లు రెవెన్యూశాఖ అధికారుల నుంచి ఎన్‌ఓసీ తెచ్చుకున్నాడు. భార్య కోటేశ్వరి పేరుపై రిజిస్ట్రేషన్ చేశాడు. అనంతరం రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయించి కోటేశ్వరి పేరుపై మళ్లీ రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ రిజిస్ట్రేషన్‌ను కూడా క్యాన్సిల్ చేశారు. ఈ వ్యవహారం ఇలా జరుగుతుండగా కోటేశ్వరరావు తల్లి నారాయణమ్మ తన కూతురు ఆస్తి తనకు చెందుతుందని, హక్కుదారుగా తన మనవడు భానుకుమార్ పేరుపై సేల్ డీడ్ చేసింది. దాని ఆధారంగా కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదే సందర్భంలో మరోసారి కోటేశ్వరి పేరుపై అదే ఆస్తిని రిజిస్ట్రేషన్ కోసం కోటేశ్వరరావు దరఖాస్తు చేసుకున్నాడు. రెండు డాక్యుమెంట్లు రావడంతో అధికారులు వీటిని తిరస్కరించారు. అనంతరం కోటేశ్వరరావు ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శాంతికుమారి ఆ ఆస్తిని తనపై వీలునామా రాసినట్లు చూపి అక్కడే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ తరువాత ఆ డాక్యుమెంట్ తీసుకొచ్చి కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మరోసారి తన భార్య కోటేశ్వరి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడు. దీనిపై భానుకుమార్ పోలీస్ కేసు పెట్టడంతో ఆ రిజిస్ట్రేషన్‌ను కూడా క్యాన్సిల్ చేయించాడు. భానుకుమార్ నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోగా దాన్ని పరిశీలన కోసం కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపారు. పోలీసు స్టేషన్‌లో ఆ ఆస్తికి సంబంధించి వివాదం ఉన్నందున భానుకుమార్ పెట్టుకున్న డాక్యుమెంట్‌ను రెఫ్యూజ్ చేస్తున్నట్లు కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు తెలిపారు. దీంతో భానుకుమార్ నేరుగా జిల్లా రిజిస్ట్రార్‌కు అప్పీల్ చేసుకున్నాడు. పరిశీలించిన డీఆర్ అన్ని సక్రమంగా ఉండడంతో రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో భానుకుమార్ పేరుపై ఆస్తి నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయింది. ఆ తరువాత కోటేశ్వరరావు రిజిస్ట్రేషన్ అయిన అదే ఆస్తిని మళ్లీ మరోసారి కోటేశ్వరి పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు. చివరకు భానుకుమార్ రిజిస్ట్రేషన్ నకిలీ అని కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో కోటేశ్వరరావు ఫిర్యాదు చేయడంతో రిజిస్ట్రేషన్ ఆర్డర్ ఇచ్చిన జిల్లా రిజిస్ట్రార్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును లోతుగా విచారిస్తే మరిన్ని నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

చదువుకుని.. కల నెరవేర్చి..

వెన్నెలకంటి రాఘవయ్య.. ఈ పెద్దాయన ఆశయం అనేక కుటుంబాల జీవితాల్ని మార్చింది. నేడు ఆ గిరిజన గ్రామం అక్షరాస్యతలో ముందంజలో ఉంది. ఎంతోమంది ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం కలిగిన ఊరి పేరు గాంధీ జనసంఘం.

- గాంధీ జనసంఘం గ్రామంలో ప్రతి ఇంట్లో ఉద్యోగి
- వెన్నెలకంటి రాఘవయ్య ప్రత్యేక చొరవ
- పిల్లల్ని చదివించిన గిరిజనులు
- అక్షరాస్యతలో ముందంజ


గాంధీ జనసంఘం గ్రామం వ్యూ

ఊరి పేరు : గాంధీ జనసంఘం	
ఇళ్లు :	జనాభా :
420	1,600

సంగం: మండలంలోని గాంధీ జనసంఘం గ్రామం. ఇది 1957 సంవత్సరంలో ఏర్పడింది. దీనికి కారణం స్వాతంత్య్ర సమరయోధుడు వెన్నెలకంటి రాఘవయ్య. ఆయన గిరిజనుల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారు. అప్పట్లో గిరిజనులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతుండడాన్ని రాఘవయ్య గుర్తించారు. సంగం మండలంలోని ర్యాంప్ సమీపంలో కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ వెళ్తుంది. అందులో చేపల వేట చేసుకుని ఉపాధి పొందుతారనే ఉద్దేశంతో జిల్లా నలుమూలల నుంచి 70 మంది గిరిజన కుటుంబాలను అక్కడికి తీసుకొచ్చి గాంధీ జనసంఘం అని పేరు పెట్టారు. పిల్లల్ని బాగా చదివించి ప్రయోజకుల్ని చేయాలని పెద్దలకు రాఘవయ్య సూచించారు. ఆయన మాటలను స్ఫూర్తిగా తీసుకున్న గిరిజనులు కష్టపడి పనిచేసి పిల్లలను ఉన్నత విద్యావంతుల్ని చేశారు. దీంతో మార్పు మొదలైంది. తర్వాతి తరాల్లోనూ చదువుకుని ఉద్యోగం చేస్తున్న వారు అధికమయ్యారు. ప్రస్తుతం ఊరిలో 420 ఇళ్లు ఉండగా 1,600 మంది జనాభా ఉన్నారు. ఇక్కడ అక్షరాస్యత శాతం 95గా ఉన్నట్లు చెబుతున్నారు. ప్రతి ఇంట్లో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. కొన్ని కుటుంబాల్లో ముగ్గురి నుంచి ఏడుగురు వరకు ఉద్యోగస్తులు ఉండడం గమనార్హం.

ఎందరో..

గాంధీ జనసంఘంలో ఎంతోమంది రాష్ట్ర, దేశస్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారు. మానికల ఏడుకొండలు అనే వ్యక్తి దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఇంజినీర్‌గా పనిచేశారు. తర్వాత ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్‌లోని మెట్రోలో ఉన్నతస్థాయి బాధ్యతలు స్వీకరించి మన్ననలు పొందారు. యాకసిరి వెంకటేశ్వర్లు ఈ జిల్లాలోనే ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆ కాలంలో ఎన్నో కార్యక్రమాలను గిరిజనుల కోసం తీసుకొచ్చారు. అలాగే గ్రామానికి చెందిన తలపల శ్రీనివాసరావు డీఎస్పీగా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. ఆయన కుమారుడు తలపల మల్లికార్జున ప్రస్తుతం శ్రీకాళహస్తి సీఐగా ఉన్నారు. టీచర్లుగా సుమారు 20 మంది, డాక్టర్లుగా ముగ్గురు, ఇంజినీర్లుగా పదిమంది, వివిధ బ్యాంక్‌ల్లో పదిమంది, రైల్వే శాఖలో వివిధ హోదాల్లో పదిమంది ఉన్నారు. సచివాలయాల్లో ఐదుగురు పనిచేస్తున్నారు.

సాహస శిఖరం



మల్లి మస్తాన్‌బాబు.. ఈయన పేరుగాంచిన పర్వతారోహకుడు. జన్మించింది గాంధీ జనసంఘంలోనే. ఈయన ఖరగ్‌పూర్ ఐఐటీలో చదివి గోల్డ్‌మెడల్ సాధించారు. రూ.లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని సైతం వదులుకుని పర్వతారోహకుడిగా మారారు. ప్రపంచంలో ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించి గిన్నిస్‌బుక్ రికార్డు నెలకొల్పాడు. ఆండీస్ పర్వత శ్రేణుల అధిరోహణకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల మృతిచెందారు. ఈయన సోదరి మల్లి దొరసానమ్మ వైద్యురాలిగా మంచి పేరు సంపాదించుకున్నారు.

బాలలకు అవగాహన కల్పిస్తూ..



ఇదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన తన గ్రామంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గ్రామీణ బాలల పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి సైన్స్ సంబంధిత విషయాలు బోధిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోనే మొదటి ఖగోళ వేదశాలను గ్రామంలో ఏర్పాటు చేశారు. దేశంలో జరిగే బాల శాస్త్రవేత్తల సమావేశాలకు పిల్లల్ని పంపుతున్నారు. సుబ్రహ్మణ్యం చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం పలు అవార్డులు అందజేసింది.

వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు రూరల్: పేదరికమే ప్రామాణికంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. మండలంలోని నువ్వూరుపాడు సచివాలయం పరిధిలో ఉన్న దేపూరులో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత పాఠశాల ప్రాంగణంలో పొదుపు మహిళలతో ముఖాముఖి మాట్లాడి ప్రభుత్వం ద్వారా వారికి అందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. మహిళా సాధికారత కోసం వైఎస్ జగనన్న ప్రభుత్వం చేస్తున్న కృషిని వారికి వివరించారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పర్యటించి కుటుంబాల వారీగా ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వారికి వివరించారు. కాలనీలో దివ్యాంగులు, వితంతువులు, పింఛన్ల కోసం ఎమ్మెల్యేకు విన్నవించగా త్వరలోనే అందజేస్తామని తెలిపారు. మరికొందరు నివాస గృహాల కోసం ఎమ్మెల్యేకు తెలియజేయగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్కమళ్ల భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, షేక్ అరాఫత్, రఘురామిరెడ్డి, హజరత్‌రెడ్డి, లక్కు కొండారెడ్డి, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉలవపాడు పునాస్‌కు ఫుల్ డిమాండ్


ఉలవపాడు పునారస్ కాయలు

- కేరళలో ఓనం పండగ
- జోరుగా ఎగుమతి

ఉలవపాడు: ఉలవపాడు పునాస్ మామిడి కాయలకు కేరళలో ఫుల్ డిమాండ్ ఉంది. ఓనం పండగ సందర్భంగా ఈ కాయలను అక్కడి వారు బాగా ఇష్టపడతారు. పండగ సందర్భంగా చేసే సంప్రదాయ పచ్చడిలో వాటిని వినియోగిస్తారు. అందువల్ల అధికంగా ఎగుమతులు జరుగుతుంటాయి. సాధారణ సీజన్ తర్వాత వచ్చే పంట ఇది. కేవలం పచ్చడి కాయలుగా ఉపయోగిస్తుంటారు. నవంబర్ వరకు దిగుబడి వచ్చినా ఓనం సమయంలో అధికంగా రేటు పలుకుతుంది. ముఖ్యమైన మూడురోజుల పండగ ఈనెల 29, 30, 31 తేదీల్లో జరుగుతుంది. ఈ పదిరోజుల్లో రోజూ 100 నుంచి 150 టన్నుల వరకు పునాస్ మామిడి ఎగుమతి జరిగింది. ఈనెల 28 వరకు ఎగుమతి చేసిన తర్వాత మూడు రోజులపాటు ఎగుమతులు నిలుపుదల చేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. రూ.40 నుంచి ప్రారంభమైన కేజీ ధర రూ.70 వరకు పలికింది. సగటున కేజీ రూ.55 చొప్పున కేరళకు ఎగుమతి చేశారు. ఓనం పండగ అంటే కేరళ ప్రజలు ఎంతో ఘనంగా చేసుకుంటారు. అలాంటి పండగకు ఉలవపాడు పునాస్ మామిడి కాయలు అధికంగా ఉపయోగించడం ఈ ప్రాంతానికి గర్వకారణమని రైతులు చెబుతున్నారు. ఉలవపాడు నుంచి లారీలు, మినీ ట్రక్కుల్లో కాయలను ఎగుమతి చేశారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: శ్రావణ మాసం రెండో ఆదివారం సందర్భంగా తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు, విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్ట్ చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.85 వేల చోరీ

కోట: కోట క్రాస్‌రోడ్డులోని లక్ష్మి పెయింట్స్ దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు దుకాణదారుడు శ్రీకాంత్ ఆదివారం ఎస్సై పుల్లారావుకు ఫిర్యాదు చేశాడు. దుకాణానికి ఉన్న షెట్టర్‌ను పగులగొట్టి దుండగులు రూ.85 వేలు చోరీ చేసినట్లు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సమీపంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:140
లేయర్ (లైవ్)	:105
బ్రాయిలర్ చికెన్	:240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:266
లేయర్ చికెన్	:178



హోరాహోరీగా టీచర్స్ క్రికెట్ లీగ్


మ్యాచ్‌లో తలపడుతున్న చిల్లకూరు, వాకాడు జట్లు

గూడూరు రూరల్: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ (టీసీఎల్)–2023 హోరాహోరీగా సాగుతోంది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25, 26, 27 తేదీల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో మూడో రోజు ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో డీవీ సత్రం జట్టుపై చిల్లకూరు జట్టు, డక్కిలి జట్టుపై రాపూరు జట్టు, కోట జట్టుపై బాలాయపల్లి జట్టు, పెళ్లకూరు జట్టుపై నెల్లూరు కార్పొరేషన్ జట్టు గెలుపొందాయి. రాపూరు, బాలాయపల్లి, నెల్లూరు కార్పొరేషన్ జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, టోర్నమెంట్ డైరెక్టర్ పి.కరిముల్లాఖాన్ మాట్లాడుతూ సోమవారం సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహించి అనంతరం విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు మురళీసింగ్, బాబర్, సతీష్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

లోయలో పడిన లారీ


శ్రీను మృతదేహం


ఘటనా స్థలంలో లారీ

- డ్రైవర్ మృతి

రాపూరు: రాపూరు – చిట్వేలి మార్గంలోని ఘాట్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున ధాన్యంలోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి లోయలో పడడంతో ఒకరు మృతిచెందగా మరొకరు గాయాలతో బయటపడ్డారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా రాజంపేట నుంచి నెల్లూరుకు 25 టన్నుల ధాన్యం లోడుతో 12 చక్రాల లారీ బయలుదేరింది. ఆదివారం తెల్లవారుజామున రాపూరుకు పదో కిలోమీటర్ మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో లారీ అదుపుతప్పి లోయలో పడిపోయింది. డ్రైవర్ శ్రీను (32) లారీలో చిక్కుకుని మృతిచెందాడు. వాహనంలో ఉన్న ఎర్రిస్వామి స్వల్ప గాయలతో బయటపడ్డాడు. అతను రాపూరు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి ఎస్‌ఐ అనూష, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన శీను మృతదేహాన్ని బయటకు తీసి రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అండర్–16 క్రికెట్ పోటీలు

వెంకటగిరి రూరల్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తారకరామ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సౌత్‌జోన్ అండర్–16 క్రికెట్ పోటీల్లో భాగంగా ఆదివారం కడప – అనంతపురం, చిత్తూరు – కర్నూలు జట్ల మధ్య క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రౌండ్–1లో బ్యాటింగ్ దిగిన కడప జట్టు 103.4 ఓవర్లకు 90 పరుగులు చేసింది. అనంతపురం జట్టు 189 పరుగులతో ముందంజలో ఉంది.

గ్రౌండ్ – 2లో..


చిత్తూరు – కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 82.2 ఓవర్లకు 244 పరుగులు తీసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 41.1 ఓవర్లకు 121 పరుగులు చేసి 5 వికెట్లు కోల్పోయింది.

హుండీ కానుకల లెక్కింపు నేడు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ తల్లి ఆలయ హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పట్టణంలోని పాతకోట రామ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు.

31న లక్ష తులసీ దళార్చన


పెంచలకోన క్షేత్రం

రాపూరు: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం లక్ష తులసీ దళార్చన, లక్ష కుంకుమార్చనపూజ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జనార్దనరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి క్రేన్ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి స్వామికి శతసహస్ర తులసీ దళార్చన, ఆదిలక్ష్మి అమ్మవారికి శతసహస్ర కుంకుమార్చన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	రూ.55
సన్నవి	రూ.40
పండ్లు	రూ.10

